నాకునచ్చిన కథగురించి పాఠకులు విశ్లేషణ రాసి పంపితే ప్రచురిస్తాం. తగిన విశ్లేషణకు పారితోషికం ఉంటుంది

తెలుగు కథ అంతర్జాతీయ స్థాయిలో తన కీర్తి పతాకను ఎగురవేసిందనే సత్యం సాహిత్యాభిమానులందరికీ తెలిసిందే. ఆనాటి నుండి ఈనాటి వరకు మనకు మంచి కథలకు కొదవలేదు. సాహిత్యపు విలువల్ని జీవితపు విలువల్ని ప్రతిబింబించే ఆనాటి ప్రసిద్ధ కథకుల కలం నుండి జారిన పసిడి తునకల వంటి కథల్ని ఏరి ఈతరం వారికి అందించి, వాటి విలువల్ని విశ్లేషించే ప్రయత్నమే ఈపాతకథ పరిచయం.



పాలగుమ్మి పద్మరాజు

# పడవ ప్రయాణం

ప్రేమకు నిర్వచనం ఇదీ అని నిర్ద్వంద్వంగా తెలియక పోయినాగానీ స్త్రీ పురుషుల జీవితాల్లో ఈ ప్రేమ ప్రముఖ పాత్రను వహిస్తోనే ఉంది. శతాబ్దాలుగా అనేక ప్రేమ కథలన్నీ చదువుతున్నాం వింటున్నాం, చూస్తూన్నాం.

ఈ కథలోని రంగికి పద్దాలంటే అపారమైన ఇష్టం. ఎంత ఇష్టమంటే-- దొంగతనంగా పడవలో సరుకు కాజేసే పద్దాల్ని తప్పించి వాడి బదులు తాను పోలీసులకు పట్టుబడి వాళ్ళచేత తన్నులు తినగలదు. వాడు తప్పతాగి తన కళ్ళెదుటే ఇంకొక స్త్రీని తెచ్చుకొని మోజు తీర్చుకుంటుంటే సహించగలదు. మోజు పడ్డ స్త్రీకి తన నానుపేటలు ఇమ్మని అడిగినప్పుడు కాదంటే తనని లోపల పెట్టి గుడిసెకి నిప్పంటించిన పద్దాల్ని ఔదార్యంతో క్షమించి గుండెలకి హత్తుకోగలదు. వాడు నెలల తరబడి తనకు కనబడికుండా పోయి గాలి తిరుగుళ్ళు తిరిగి తన గడపకు వస్తే ఒళ్ళోకి తీసుకొని లాలించి తనను తాను అర్పించుకొని వాడిలో ఐక్యం అయిపోగలదు.

వాడు ఎన్ని తిరుగుళ్ళు తిరిగినా ఎంత మందితో తిరిగినా తనకాడకే వస్తాడు. తాను లేకపోతే గుండె పగిలి చచ్చిపోతాడు. ఇలా అనే రంగి మాటల్లో పద్దాల పట్ల అంతులేని విశ్వాసం, ఆశ నిండి ఉంటాయి. అంత విశ్వాసం ఆశే ఆమె జీవితానికి కేంద్రమై ఆమెకు ఊపిరై నెలల తరబడి పద్దాలుకై ఎదురు తెన్నులు చూచెటట్లు చేస్తున్నాయి. ఆమెలో అతని పట్ల ఆరని అనురాగాన్ని జ్వలింపచేస్తున్నాయి. అంతులేని ఆశల్ని రేకెత్తిస్తున్నాయి.

ఆదర్శమైన ప్రేమలో వ్యక్తిత్వమే నశించాలి. "నేను, నువ్వు" అనే భావమే అదృశ్యం కావాలి. — చలం

ఆర్థిక సాంఘిక చారిత్రక, వ్యత్యాసాల కతీతమై మనిషిని మనిషినీ స్నేహపాశంలో బంధించివేసే మానవత్వం యొక్క శక్తుల్ని తరచి చూసినప్పుడు ఆ దృశ్యాన్ని తన్మయతతో అనుభవించగలం. కానీ ఆ అనుభవాన్ని మాటల్లో చెప్పలేం. ఈ జీవిత రహస్యం, దాన్ని తెలుసుకోవటానికి మానవుడు చేసే యత్నం ఏ గొప్ప గ్రంథానికైనా పునాది. ________ బుచ్చిబాబు

పద్దాలుపట్ల రంగికున్నది భక్తికాదు. భయం కాదు. ప్రేమ కాదు. ఈ రకం స్వభావం కలిగి ఉడటం ఆమె ఆదర్శం కాదు. రంగి స్వచ్ఛమైన సహజమైన హృదయం గల స్త్రీ. ఆమె హృదయం ఎన్నో సంకీర్ణభావాలకు నిలయం. మానవ సహజమైన ఈర్ష్యాసూయలతో నిండిన హృదయం ఆమెది. స్త్రీత్వపు లాలిత్యంతో వాత్సల్యంతో పద్దాల్ని తన వాడిగా చేసుకొని వాడికై నిరంతరం తపిస్తుంది. పద్దాలులో గల అవగుణాలను ఆమె క్షమించింది. సుగుణాలను గుర్తించింది. వాడిని ఒక మనిషిగా అంగీకరించి వాడిని ఉన్నదుట్లుగా స్వీకరించింది. అందుకే వాడితో తన్నులు తిని కూడా వాడిని తన ఒడిలోకి ఆహ్వానించి లాలించగలదు. ఈ అంగీకారంలోనే ఆమెకు సుఖముంది. తన జివన మాధుర్యం ఉంది.

స్వేచ్ఛగా గొంతెత్తి తనవాడికై పాటలు పాడుతూ వాడిని సుఖపెడుతూ తాను సుఖపడగల రంగి బ్రతుకు ఆధునిక నాగరిక లోకానికి బరువు అనిపించవచ్చు. అసహ్యమనిపించవచ్చు. కాని ఈర్ష్యాసూయలకు కుహనా సంస్కారాలకు నిలయమై పైకి నవ నాగరికంగా కనపడుతూ నటన, నాటకీయతే ఊపిరిగా బ్రతికే నేటి ఆధునిక స్త్రీ పురుషుల కంటే రంగి జీవితం సహజమైంది స్వచ్ఛమైంది.

ఆమె స్త్రీత్వం గోదావరంత పవిత్రమైంది. నీటి అలలంత మృదువైంది. చిరుగాలుల తాకిడంత చల్లనైనది.

రంగిని చూచిన కథకునికి తరతరాలుగా మగవాడిని లాలించి పాలించిన స్త్రీత్వపు గాథలు గుర్తుకు రావడమే గాక ఆ చీకటి రాత్రి విశాలమైన స్త్రీత్వాన్ని అలంకరించుకున్న అనుభూతి కలుగుతుంది. రంగి చెప్పే మాటల్ని కథకుడు భక్తితో, భయంతో వింటాడు. రంగితత్వం అతనికి వింతగా తోస్తుంది.

ఆ చీకటి రాత్రి రంగి కథ విని ఆమె ఔన్నత్యాన్ని గుర్తించిన కథకుడు తెల్లారాక అసహజమైన లోక మర్యాదలకు లొంగి పనికిమాలిన జాలిని ప్రదర్శించి ఆమె చేతిలో ఒక రూపాయి పెట్టి పడవ దిగివెళ్ళిపోవటంతో మన గుండె కలుక్కుమంటుంది.

—— ఎస్.ఎస్.ఎల్

పొద్దు కుంకిన తరువాత లోకమంతా దిగులుగా ఉంది. పడవ మెల్లగా నీటిమీద జారుతోంది. నీరు పడవ పక్కని కలకలమంటూ రాసుకుంటోంది. చూపుమేరలా జీవ సంచలనంలేని ప్రపంచం నిశ్శబ్దంగా జుమ్మంటోంది. ఆ ధ్వని చెవులకు వినపడక దేహాన్నంతనీ తాకుతోంది. మనస్సులో లోపల అది నిండుగా కంపిస్తున్నట్టు ఉంటుంది. అప్పుడు ఏదో బ్రతుకు చివర ఆఖరయిపోతున్న నిస్పృహ, ప్రశాంతమయిన నిరాశ మనస్సులో నిండుకుంటాయి. దూరంగా చెట్లు అస్పష్టంగా, మాయగా పడవతో కూడా నిశ్చలంగా ముందుకి సాగుతాయి.

దగ్గరగా ఉన్న చెట్లు తలలు విరగబోసుకున్న పెద్ద దెయ్యాల్లాగా జీబురుమంటో వెనక్కి నడుస్తాయి. పడవ కదలదు. కాలవగట్టు కదులుతుంది. నా చూపులు చొచ్చుకుని చొచ్చుకుని నీటిలోకి చూస్తాయి. అందులో ప్రతిబింబించిన చీకటిని చీల్చుకుని చూస్తాయి. నక్షత్రాలు మెల్లగా కెరటాల మీద వివశంగా ఉయ్యాలలూగుతాయి. కన్ను తెరచి నిద్రపోతాయి.

గాలిలేదు. పడవ లాగేతాడు, మునిగ్రచప్పుడయి నప్పుడల్లా బిగువుగా, వొదులుగా అవుతోంది. పడవ వెనక భాగంలో పొయ్యిలో నిప్పు మండుతోంది. అప్పుడప్పుడు రప్పుమంటోంది. అప్పుడప్పుడు తగ్గిపోతుంది. లోపలికి ఊరిన నీరు చేదతో తోడి ఒక కుర్రవాడు కాలవలోకి పారబోస్తున్నాడు. పడవ లోపల ఏవేవో బస్తాలున్నాయి. ధాన్యం, బెల్లం, ఉప్పు, చింతపుండు వగైరా. పడవటాపుమీద నేను వెల్లగిల పడుకున్నాను. పడవ లోపలనించి చుట్టపొగలు, ఏదో సంభాషణ కలిసి మెల్లగా తాపీగా అన్ని దిక్కులకీ వ్యాపిస్తున్నాయి. గుమాస్తా కూచున్న గదిలో గుడ్డి దీపం కొద్దిగా కుమకుతోంది. పడవ సాగుతోంది.

"ఏయి పడవా? ఈ గట్టుకి రావీ! ఈ గట్టుకి!" అని ఎవరో పిలిచారు.

పడవగట్టుకి జేరడంతోనే ఇద్దరు ఎక్కారు. పడవ ఆ పక్కకి కొంచెం వొరిగింది.

"టాపుమీద కూకుంటలే!" అంది ఆడ గొంతుక.

"ఇన్నాళ్ళూ ఏడపోయావే? కనపట్టం లేదు" అన్నాడు చుక్కాని కాస్తున్న మనిషి.

"ఇజావగరం, ఇశాకపట్టణం, మావోడూ నేమా కలిసి తిరిగొచ్చాం. అప్పన్న కొంటకెల్లాం"

"ఏడబోతన్నా?"

"మందపాక పోతన్నాం మరిదీ! కులాసగున్నావా? గుమాత్తాగారు పాతోరేనా?"

"ఆ!"

మగవాడు టాపుమీద అడ్డదిడ్డంగా పడుకుని ఉన్నాడు. అతని నోట్లో చుట్ట పక్కకి పడిపోతే ఆడమనిషి తీసి ఆర్పేసింది.

"ఓరేయి! నెగిసి కూకోరా!"

"నోరుముయ్యి....నెంజా! నేను తాగావనుకుంటున్నావా? ముక్కులిరగదంతాను." ఒక పక్కనించి ఇంకో పక్కకి తిరిగి పడుకున్నాడు. ఆడది అతని వొంటిమీద గుడ్డకప్పింది. తనో చుట్ట తీసి అంటించింది. అగ్గిపుల్ల రప్పుమనప్పుడు ఆమె ముఖం చూశాను. నల్లగా వున్న ముఖం ఎర్రగా వెలిగింది.

ఆమె గొంతుకలో మగజీర ఉంది. ఆమె మాట్లాడుతున్నప్పుడు చనువుగా ఒప్పిస్తున్నట్టుగా ఉంటుంది. ముఖం అందమయినది కాదు. జుట్టు చెదిరిపోయినా ముఖంలో ఏదో పెద్దమనిషి తరహా వుంది. నల్లటి రవిక వున్నట్టు తెలియడంలేదు. చీకట్లో కూడా ఆమె కళ్ళు మేలుకున్నట్టు మెరుస్తున్నాయి. అగ్గిపుల్ల వెలుగులో పక్కని పడుకున్న నన్ను చూసింది.

"ఈ పక్క నెవరో పడుకున్నార్రా!" అని మగవాణ్ణి తట్టి లేపింది.

"తొంగోవే నెంజా. గొడవెడితే డొక్కలూడదంతాను" మగవాడు అతిప్రయత్నంమీద కొంచెం దూరంగా జరిగాడు.

ఇంతలో దీపం పైకెత్తి గుమాస్తా పడవ పక్కని నిలబడి చూశాడు. "ఏమే రంగీ, ఈడెవడు?" అని అడిగాడు.

"మావోడండి, బాబ్బాబు, రిమార్కు రాయిందండి" అంది రంగి.

"పద్దాలే దింపెయ్యి? దొంగ తొత్తు కొడుకుని. నీకు బుద్దిలేదూ! మళ్ళీ ఆణ్ణి పడవెక్కించా? తాగుబోతోణ్ణి."

"నే తాగందే. ఎవరంట నే తాగానంటా?" అన్నాడు పద్దాలు.

"ఒరే దింపెయ్యండర్రా! ఎందు కెక్కనిచ్చారీణ్ణి! చిత్తుగా తాగున్నాడు."

"చిత్తుగా నేదు. కొంచెం దావత."

"ఊరుకోరా! గుమాత్తాగార్రా! బాబ్బాబు, మండపొక్కాడ దిగిపోతాం."

"గుమాత్తాగారూ! దండాలండి! తమ దయుండి. నేను తాగనేదు బాబూ!"

"ఏమన్నా అల్లరిచేస్తే కాలవలోకి తోయించేస్తాను జాగ్రత్త!" గుమాస్తా గదిలోకి వెళ్ళిపోయాడు. పద్దాలు లేచి కూర్చున్నాడు. నిజానికి అట్టే తాగినట్టులేదు.

"కాలవలోకి తోయించేత్తాడంట! నా కొడుకు" అన్నాడు మెల్లగా.

"ఊరుకోరా! ఇనపడద్ది"

"రేప్పొద్దున్న పడవ సూసుకోమను. యాపాలేత్తాడు. నా కొడుకు."

"ఉస్సు! ఆ పక్క నెవరో పడుకున్నారు."

"ఎవరు?..... నిద్దరోతన్నారు" పద్దాలు చుట్ట అంటించాడు.

పద్దాలుకి బొద్దు మీసాలు. కోల ముఖం. చాతీ ఎప్పుడూ విరుచుకని వుంటుంది. వెన్నెముక ఉండేలు బద్దలాగ వంగి నిలబడుతుంది. మొత్తంమీద మనిషి కొంచెం సన్నగా నిర్లక్ష్యంగా ఉంటాడు.

పడవ మళ్ళీ నిశ్శబ్దంగా సాగుతోంది. పడవ వెనక భాగంలో నిప్పు రగలడంలేదు. సరంగులు తిండి తిన్న గిన్నెలు తాపీగా మట్లాడుకుంటూ కడుక్కుంటున్నారు.

గాలి చలిగా లేదు. అయినా నేను కండువా కప్పుకున్నాను. అనంతమయిన ఆ చీకటికి అసహాయంగా శరీరాన్ని అప్పగించడానికి నాకు భయం వేసింది. గాలి మాత్రం చురుకుగా ఉంది - మెత్తని స్త్రీ స్పర్శలాగ. పడవ నీటిమీద ఎంత మృదువుగా రాసుకుపోతోంది! చెప్పలేనంత మృదుత్వం, విశాలమైన స్త్రీత్వం ఆ రాత్రిలో నిండుగా అలంకరించుకుని వుంది. ఆ కౌగిలిలో నాకు చిరకాలం నాటి విషాద గాథలు మెల్లగా ఆప్యాయంగా జ్ఞాపక మొస్తున్నాయి--అనాదినుంచీ మగవాణ్ణి లాలించి పోషించిన స్త్రీత్వపుగాథలు.

నాకు కొంచెం దూరంలో రెండు చుట్టలూ

గాలి చలిగా లేదు. అయినా నేను కండువా కప్పుకున్నాను. అనంతమయిన ఆ చీకటికి అసహాయంగా శరీరాన్ని అప్పగించడానికి నాకు భయం వేసింది. గాలి మాత్రం చురుకుగా ఉంది. మెత్తని స్త్రీ స్పర్శలాగ. పడవ నీటి మీద ఎంత మృదువుగా రాసుకుపోతోంది! చెప్పలేనంత మృదుత్వం, విశాలమైన స్త్రీత్వం ఆరాత్రిలో నిండుగా అలంకరించుకుని వుంది. ఆ కౌగిలిలో నాకు చిరకాలం నాటి విషాద గాథలు మెల్లగా అప్యాయంగా జ్ఞాపక మొస్తున్నాయి - అనాదినుంచీ మగవాణ్ణి లాలించి పోషించిన స్త్రీత్వపు గాథలు.

ఎర్రగా కాలుతున్నాయి. జీవితం బరువుగా అక్కడ కూర్చొని ఆలోచించుకుంటూ చుట్ట కాలుస్తున్నట్టు నాకు అనిపించింది.

"వొచ్చేదేవూరు?" అన్నాడు పద్దాలు.

"కాల్దారి" అంది రంగి.

"ఇంకా శానాదూరముంది."

"ఇయ్యాల జాగత్తుంద్రా. వొద్దు. వొద్దు. ఈలుసూసుకుని తరవాత? ఏరా నా మాట నవూ?" రంగి జాలిగా బతిమాలుతూ అడిగింది.

"బెదురు నెంజకి" - అన్నాడు పద్దాలు. అంటూ ఆమె పక్కలో వేలెట్టి పొడిచాడు.

"అమ్మో!" అంది రంగి. అని తన్మయంగా ఆకాశంలోకి ముఖమెత్తి చీకట్లోకి చూసింది. ఆ స్పర్శ శాశ్వతంగా ఉండిపోవాలని కోరుతున్న ట్టుగా ఆమె ముఖమెత్తింది.

నాకు క్రమంగా నిద్రపట్టింది. పడవంతా కూడా నిద్రపోతూ, నీటివాలుకి మెల్లగా జారిపో తోంది. నాకు కొంచెం దూరంలో ఆ ఇద్దరు వ్యక్తులూ కొంతసేపు గుసగుస లాడుకున్నారు. నాకు నిద్రపట్టినా, పూర్తిగా పట్టలేదు. పడవ నదుస్తున్నట్టు, నీరు జారుతున్నట్టు, చెట్టునె నక్కి పోతున్నట్టు తెలుసును. పడవ నెవరూ లాగడంలేదు. పడవ లోపల అంతా కునుకుతు న్నారు. రంగి నా పక్కనించి నడిచి చుక్కాని దగ్గరకు వెళ్ళి కూచుంది.

"మరిదీ! ఎల్లాగున్నా?" అంది.

"మవ్వెల్లాగున్నా" అన్నాడు చుక్కాని కాసే వాడు.

"ఎన్నెన్ని చిత్తరాలు చూపించా దనుకున్నా మావోడు! చినీమాకెళ్ళాం! ఓడల్ని సూశాం! ఓడంటే ఓడకాదు మరిదీ! మా వూరంతుంది. మరి సుక్కా నెక్కడుందోగాని!" రంగి అల్లా ఏదో చాలాసేపు కబుర్లు చెపుతూ కూర్చుంది. ఆ కబుర్లు జోకొడుతున్నట్టున్నాయి.

"పిల్లా! నాకు నిద్దరొత్తందే!" అన్నాడు చుక్కాని కాసే మరిది.

"సుక్కాని నే సూత్తాలే మవ్వలా తొంగో మరిదీ!" అంది రంగి.

పడవ మళ్ళీ మెల్లగా జారిపోతోంది - నిశ్శబ్దంగా. రంగి ఆ నిశ్శబ్దాన్ని కదపకుండా తన గొంతు కెత్తి చల్లగా పాట పాడింది.

"యాడున్నాడో! - నా వోడు - యాడున్నాడో!

కూడు గిన్నెలో యెట్టి - కూకుని సూత్తుంటే

నీడల్లె మా పెల్లి నిదరే కంటికిరాదు - యాడున్నాడో!

తేలల్లే కొండెత్తి - తెగకుట్టే సలిగాలికి

నా లోపలంతా బిగిసినాడో మరిదీ!

యెచ్చని నీ వొళ్ళు నన్నొత్తితేగాని

సచ్చిపోతానేమొ..........యాడున్నాడో"

రంగి గొంతుకలోని మగజీరలో సంగీత ముంది ఆ పాటలో పడుకుని ఉన్న అన్ని ప్రాణులూ ఒకసారి కునికాయి. గడిచిన యుగాల ప్రేమ గాథలు వింతగా, మెల్లగా, విషాదంగా ఆ పాటలో కంపించాయి. ఆ పాట నీటి వెల్లువై పొంగితే అందులో లోకం చిన్న పడవలాగ తేలిపోయింది. మానవ జీవితం ఈ ప్రణయంతోటి, ఈ విషాదంతోటి బరువుగా, మాయగా, వింతగా అనిపించింది.

నాకు కొంచెం దూరంలో పద్దాలు నెత్తిని ముసుగు మూసుకొని కూర్చున్నాడు. కానీ, అతనికీ రంగికీ మధ్య కొన్ని యుగాల అంతర మేదో ఉన్నట్టు తోచింది. అతను టాపు దిగి పడవలోకి పోయాడు. నేను ఒంటరిగా వెల్ల గిల పడుకొని చూస్తున్నాను. రంగి అల్లాగే పాడుతోంది.

"గుడిసెనక సందులో గుంటున్నా దాని
సడి సెయ్యక మవ్వు దగ్గర జేరితే
గుడిసెనక గుంటెవరు? బావా?
నడివయసులో నేను కానా!"

నాకు నిద్రపడుతోంది. రంగిపాట అల్లా లోకాలు తిరిగి వచ్చి మళ్ళీ మెల్లగా నా గుండెల్లో తగులుతోంది. నాకు నిద్రపట్టింది. నిద్రలో ప్రాకృతికమయిన ప్రణయం నా ముందు గంతులు వేసింది. పల్లెటూళ్ళలో కాపు పడుచులు తమ ప్రియులతో దాగుడు మూతలాడుకుంటూ పాటలో కలిసి పోయారు. నేనెరుగని ఒకానొక స్వాప్నికలోకం నాముందు నిద్రలో తెరుచు కుంది. అందులో రంగి, పద్దాలు అనేక రూపాలతో తిరుగుతున్నారు. పాట క్రమంగా నా జ్ఞాప్తిలోనించి పోయింది. నిద్ర నా మనస్సు తలుపులు మూసింది.

* * *

పడవలో కొంచెం గొడవయింది. నేను కళ్ళు నులుపుకుంటూ లేచాను. పడవ గట్టుకి చేర్చి వుంది. రెండు లాంతర్లు పట్టుకుని సరం గులు కంగారుగా పడవ ఎక్కి దిగుతున్నారు. గట్టుమీద రంగిని ఇద్దరు గట్టిగా పట్టుకున్నారు. అందులో ఒకడు గుమాస్తా. అతని చేతుల్లో మడిచిన తాడుంది. రంగికి అప్పుడే దెబ్బలు తగిలుంటాయి. నేను చటుక్కున పడవ దిగి గట్టు మీదికి గెంతాను. ఏం జరిగిందని అడిగాను. "ఆ దొంగనాకొడుకు పారిపోయాడు. సరుకు ఎత్తుకుపోయాడు. ఈ లంజ ఎక్కడో గట్టుకు తార్చింది పడవని. సుక్కాని పట్టు కుంది లంజ." గుమాస్తా కోపంగా, చిరాకుగా నిస్పృహతో అన్నాడు.

"ఏం పోయాయి?" అని అడిగాను.

"రెండు బెల్లం బుట్టలు, మూడు చింత పండు బుట్టలు. నేనందుకే ఎక్కనివ్వొద్ద న్నాను. యజమాని నాక్కడతాడు నష్టమం తాను. ఎక్కడ దింపుకుపోయాడే?"

"కాల్దారి కాడండి! బాబయ్యా!

"ఛీ! లంజా! కాల్దారి కాడ మేం మేలుకు ముంటేనే?"

"అయితే నిడదోలు కాడేనండి!"

"ఇదిప్పుడు చెప్పదు. రేపు అత్తిల్లో పోలీసోళ్ళ కప్పగిద్దాం! ఎక్కు, పడవెక్కు."

"నన్నిక్కడొగ్గెయ్యండి బాబ్బాబు!"

"అట్టే యేసాలెయ్యకు. ఎక్కెక్కు!" గుమస్తా ఆమెను పడవ్వేపు తోశాడు. ఇద్దరు సరంగులు ఆమెను పడవెక్కించారు. "నిద్దర మొకాలు! జేరారు! సూసుకోవొద్దూ! దాని చేతుల్లో సుక్కాని ఎవరెట్టమన్నారు! బుద్ధి లేదూ?" గుమాస్తా అందరిమీదా విసుక్కుని గదిలోకి పోయాడు. రంగిని టాపుమీదికి ఎక్కించారు. ఒక సరంగు ఆమె పారిపోకుండా కాపలా వున్నాడు. నేను కూడా టాపుమీదికి ఎక్కాను. పడవ మళ్ళీ కదిలింది. నేను చుట్టముట్టించాను.

"అయ్యగోరో సుట్ట ఇప్పించరూ!" రంగి చనువుగా అడిగింది. నేనో చుట్ట, అగ్గిపెట్టి ఇచ్చాను. ఆమె చుట్ట ముట్టించింది "మరిదీ! నన్ను పోలీసోళ్ళ కప్పగించి ఏం లాభం?"

"గుమాస్తా వదలడు!" అన్నాడు సరంగు.

"పద్దాలు నీ మొగుడా?" అని అడిగాను.

"మా వోడు" అంది రంగి.

"దీన్ని నెగదీసుకుపోయాడండీ! పెళ్ళా డలేదు. ఆడికి ఇంకొకత్తుంది. ఇప్పుడది ఎక్కడుందే?" అన్నాడు సరంగు.

"కొవ్వూరులో ఉంది. రంగూ, పొంగూ బాగుందిప్పుడు. నేను తిన్నన్ని తన్నులు తింటే అదీ నా లాగే అవుద్ది. గుడిశేటినెంజ."

"మరి నీ కింకా వాడితో ఎందుకు?" అన్నాను నేను.

"ఆడు నవోడండి!" అంది-అంతా అందులో ఉన్నట్టుగా.

"మరి ఇంకొకత్తితో పోతున్నాడన్నావుగా?"


"నా దగ్గరికి రాకుండా ఎక్కడ పోతాడు? మొగోడికెంత మందయితే మాత్రమేం? ఆడండి, అయ్యగోరూ! మా రాజండి. అల్లాంటి మనిసిలే దండి మళ్ళీని."

"బాబో! ఆడి సంగతి మీరింకా ఎర గరు. ఇదెంత రంగుగా ఉండేదను కున్నారు: ఓతూరండి, దీన్ని గుడిసెలో పెట్టి గుడిసె అంటించేశాడు. మగ్గి పోయిందనుకోండి! ఇంకా దీనికి భూమ్మీది మాకలున్నాయిగాని" అన్నాడు సరంగు.

"అయ్యగోరు! అప్పుడు ఆడు కనమడితే పీక నులిపేద్దామనుండేది. కాలిన గడోటి ఈపు మీద పడిందండి" ఆమె వెనక్కి తిరిగి రవిక కొంచెం పైకెత్తింది. తెల్లటిమచ్చ ఆ చీకట్లో కూడా స్పష్టంగా కనబడింది.

"మరి నిన్నిల్లా చేస్తుంటే ఇంకా వాణ్ణే

మానవ జీవితం ఈ ప్రణయం తోటి, ఈ విషాదం తోటి బరువుగా, మాయంగా, వింతగా అనిపించింది.


Bali

పట్టుకు దేవులాడతావేం?" అని అడిగాను.

"ఏం చెయ్యను? అదు కంటబడితే అన్నీ మరిచిపోయి కరిగి పోతాను. ఎంత జాలిగా మాట్లాడతాడని! ఈ సందాల కొవ్వూరులో బయలుదేరాం. దార్లో నన్ను ఎంతో జాలిగా బతిమాలాడాడు. ఈ పడవలో ఎక్కి చేతికిచ్చిన సరుకు దించి పారెయ్యాలని. నేనుంటేగాని పోగదు. ఆడ్డదోవని నడిచి మడుగు జేరుకున్నాం........."

"ఎక్కడ దింపేశాడు సరుకు?"

"ఎక్కడో నాకు గుర్తునేదండి"

"దొంగనెంజ", అన్నాడు నవ్వుతూ సరంగు. రంగి మొగం చూడాలని నాకు ఎంతో కుతూహలం వేసింది. కాని ఆ కటిక చీకట్లో ఆమె మాయ మనిషిలాగ అవ్యక్తంగానే ఉండిపోయింది.

పడవ మెల్లగా పాకుతోంది. నడిరాత్రి గడిచిన కొద్దీ గాలి చిరుచలిగా తగులుతోంది. చెట్ల ఆకులు కొద్దిగా కదులుతున్నాయి. మళ్ళీ పడవని సరంగులు లాగుతున్నారు. నా కింక నిద్రపట్టలేదు. కొంత సేపటికి కాపలా వున్న మనిషి కునికి ఒరిగి చివరికి నిద్రపోయాడు. రంగి మాత్రం ఇంక పారిపోయే ప్రయత్నం మానుకుంది. తాపీగా చుట్ట కాలుస్తూ కూర్చుంది.

"నీ కసలు పెళ్ళి అవలేదా?" అని అడిగాను నేను.

"లేదు. సిన్నతనంలోనే పద్దాలు నన్ను లెగేసుకొచ్చాడు."

"మీదేవూరు?"

"ఈంద్రపాలెం......... అప్పుడు తాగుతాడని నాకు తెలదు........... ఇప్పుడు నేనూ తాగుతాననుకోండి. తాగితే తప్పలేదు. తాగి సావగొడతాడు."

"మరి వాడిని వెళ్ళిపోకపోయావా?"

"తమ్మలు తిన్నప్పుడల్లాగని పిత్తది. అయినా అంతటి మనిషి లేడండి. మీరెరగరు. ఉత్తప్పుడండి, మెన్నలా కరిగిపోతాడు. వొందమందితో పోయినా సరే ఆదు నాకాడికొచ్చి తీరతాడు. నేను లేకపోతే గుండగిలి సచ్చిపోడూ?"

వాకు వింతగా అనిపించింది. ఆ అమ్మి తత్వం. వాళ్ళిద్దరికీ మధ్య ఉన్న అనుబంధం ఎల్లాంటిదో నాకు అర్థం గాలేదు. రంగి మళ్ళీ చెప్పడం మొదలెట్టింది.

"మా కిద్దరికీ ఏ పనీ సరిపడింది కాదు. సిగురుకి ఇల్లా దొంగతవాల్లోకి దిగాం. మాయమ్మందేది. మొన్న సచ్చిపోయింది. నన్ను తిడుతుండేది. ఓ వాడండి, నా గుడిసికి ఆ నెంజని తీసుకొచ్చాడు."

"ఎవరిని?"

"ఇప్పదున్న గుంటని. నా యెదురుగుండా, నా ఇంటో దాంతో తొంగున్నాడు. నా

"ఆదు నావోడు! ఎన్ని తిరుగుళ్లు తిరిగినా నావోడు. నా దగ్గరకే వొత్తాడు." అని తనలో తను అనుకుంది. అందులో ఒక ఆశ, ఒక దైర్యం, ఒక విశ్వాసం తొణికిసలాడాయి. ఆ మాట ఆమె జీవిత సర్వస్వానికి కేంద్రంలాగా అవుపించింది. నేను భయంతో, భక్తితో, జాలితో ఆమాట విని ఊరుకున్నాను. అల్లాగ తెల్లవారీదాకా మేమిద్దరం కూర్చున్నాం.

కళ్ళదర! చిత్తుగా తాగొచ్చాడు. అదీ తాగింది. నా సయితి! దాని మీదపడి పీకాను. ఆదు నన్ను పొవదన్నాడు. అర్ధరేత్తిరికాడ దాన్నెక్కడకో తీసుకుపోయాడు. మళ్లీవొచ్చాడు. నేను తిట్టాను. ఇంటోకి రావద్దన్నాను. గుమ్మం కాడ కూకుని పిల్లోడికన్న జాలిగా ఏడిచాడు. నా గుండి కరిగిపోయింది. నేను దగ్గరగా జేరితే నన్ను వాళ్లోకి తీసుకుని నా నానుపేట ఇమ్మన్నాడు. ఎందుకన్నాను, ఆ గుంట తెమ్మందన్నాడు. నాకు ఒళ్ళు తెలదు, నానా తిట్లు తిట్టాను. ఏడిచాడు. ఆ గుంటలేకపోతే బతకలేనన్నాడు. నాక్కోపం ఎక్కువయిపోయింది. గుమ్మం లోంచి గెంటి తలుపేసుకున్నాను, తలుపు గుంజి గుంజి సివరికి ఎల్లిపోయాడు. నాకు శానాసేపు నిద్దర రాలేదు. కొంచెం కునుకు పట్టేతలికి ఇల్లంటుకుంది. తలుపుపైన గొళ్లెమేసి నడికొప్పంటించాడు. ఎవరూ రాలేదు. నడిరాత్తిరి. నా వొళ్ళంతా మగ్గిపోయింది. తలుపు గుంజీ గుంజీ ఇంక తెలివి తప్పింది. ఇంతలో ఎవరో అవతల్నించి తలుపు తెరిచారు. మన్నాడు అణ్ణి పోలీసోళ్ళుట్టుకున్నారు. ఎవరిమీద అనుమానముందో నన్ను చెప్పమన్నారు. ఆదు మాత్రం గాదని కచ్చితంగా చెప్పేశాను. సందేల నాకాడకొచ్చి. ఎంతో జాలిగా ఏడిచాడు. తాగినప్పుడల్లా ఏడుస్తాడు. ఉత్తప్పుడసలు ఏడుపేరాదు. నవ్వుతుంటాడు. సుక్కడితే సాలు, ఏడుపే. పిల్లోడికన్నా ఎక్కువగా ఏడుస్తాడు. నా నానుపేట లిచ్చేసాను."

"మువ్వింకా వాడితో ఎందుకు దిగుతావు ఈ దొంగతవాల్లోకి?"

"ఏం జెయ్యమంటారు? ఆడొచ్చి గోలెడితే?"

"మరి నిన్ను విజయనగరం అక్కడికి తీసుకుని వెళ్ళడన్నావు?"

"వొట్టిది. ఊరికే అల్లా సెప్పాను. నేనంటే కొంచెం సరంగులికి నమ్మకం. ఇదిగాక రెండు తూర్లు ఈ పడవలో దొంగతనం జరిగింది."

"నిన్ను పట్టుకుంటే పోలీసులు ఏం జేస్తావు?"

"ఏమీ చెయ్యను. నన్ను పట్టుకుని ఏం జేస్తారు? నాకాడ దొంగ సొమ్ములేదు. ఏమె, ఎవరెత్తుకపోయ్యారో. ఓ రోజు కొడతారు. మన్నాడొగ్గేత్తారు."

"పద్దాలుని పట్టుకుంటే? ఆ దొంగసొమ్ముతో దొరికిపోతే?"

"ఆదు దొరకదు. ఈ పాటికంతా అయిపోద్ది. ఆదు దొరక్కుండానే నేను పడవలో ఉండిపోతా."

ఆమె నిట్టూర్పు విడిచి మళ్ళీ మెల్లగా తనలో తను అనుకున్నట్టు చెప్పింది.

"ఈ సొమ్మంతా మళ్ళీ ఆ గుంటకే దక్కుడు. దానిమీద మోజు తగ్గేదాకా దాన్నొదలడు. నేను ఈ కట్టాలన్నీని. దొంగనెంజ! నా ఉసురోసుకుంటది."

ఆ మాటల్లో నిజంగా ఉద్రేకమేమి లేదు. ఆమె అతణ్ణే ఉన్నవాణ్ణే ఉన్నట్టుగా అంగీకరించింది. పద్దాలు కోసం ఆమె ఎల్లాంటి పనన్నా చేయుడానికి సిద్ధంగా ఉంది. అది ఒక ఆదర్శమూ కాదు, భక్తికాదు, ప్రేమాకాదు. ఎన్నో చిత్రమైన సంకీర్ణ భావాలతో, ఈసులతో, అనురాగాలతో ఎన్నిటితోనో కలిసిన స్త్రీ హృదయం. అయినా ఆ హృదయం అన్నిటికీ ఫలితంగా ఒకేచోట లగ్నమయింది. తన మగవాడికోసం ఆమె నిరంతరం తపిస్తుంది. కానీ అతడు నిర్దుష్టంగా, నీతిగా నడుచుకోవాలని ఆమెకు పట్టింపులేదు. అతని సుగుణాలతో, అవగుణాలతో అతన్ని ఆమె అంగీకరించింది. నాకామె బ్రతుకు బరువనిపించింది. నిజానికి నా బ్రతుకు బరువేమో అంతకంటే.

గాలి అంతకంతకు బాగా వీస్తోంది. పడవ కొంచెం వేగంగా పోతోంది. అలసట తీర్చుకున్న లోకం నిద్రమేలుకోబోతుంది. అక్కడక్కడ పాలికాపులు పొలంగట్లని నడుస్తూ కనబడుతున్నారు. వేగుచుక్క ఇంకా పొడవలేదు. రంగిమోకాళ్ళు ముడుచుకుని ఎటో అవ్యక్తంగా చూస్తోంది.

"ఆదు నావోడు! ఎన్ని తిరుగుళ్లు తిరిగినా నావోడు. నా దగ్గరకే వొత్తాడు." అని తనలో తను అనుకుంది. అందులో ఒక ఆశ. ఒక దైర్యం, ఒక విశ్వాసం తొణికిసలాడాయి. ఆ మాట ఆమె జీవిత సర్వస్వానికి కేంద్రంలాగా అవుపించింది. నేను భయంతో, భక్తితో, జాలితో ఆమాట విని ఊరుకున్నాను. అల్లాగ తెల్లవారీదాకా మేమిద్దరం కూర్చున్నాం.

నేను పడవ దిగిపోయే ముందు జేబులోంచి ఒక రూపాయి తీసి చటుక్కుని ఆమె చేతిలో పెట్టి తొందరగా ఊళ్ళోకిపోయాను. ఆమె జవాబు చెప్పేదాకా నేను నిలబడలేదు. ఆమె సంగతి తరవాత ఏం జరిగిందో నాకు తెలియదు.

*